## స్కెచ్:

# పెళ్లి చూపులు

కాలనీలో ఖాళీగా వున్న 'ప్లాట్స్' లో కొందరు గుడిశలు వేసుకుని వుంటున్నారు. పూట గడవని అన్నపూర్ణ కాలనీలో నాలుగైదు యిళ్లలో పని చేసు కుని బతుకుతోంది. నాలుగిళ్ళల్లో పని చేసి, నలుగురూ పెట్టిన అన్నం, కూరా, పులుసు తెచ్చి అన్నపూర్ణ, ఏ పని చెయ్యలేని మొగుడికి, ముగ్గురి పిల్లలకి పెట్టి తను తింటుంది. ముగ్గురు మగ పిల్లలున్నారు. అయినా అంత దరిద్రంలోనూ మరొక ఆడ పిల్ల కావాలనుకుంటోంది.

అడ పిల్లలున్న వాళ్లు వేలకు వేలు కట్నాలు పోసి తగిన వరుణ్ణి తెచ్చి పిల్లకి పెళ్లి చెయ్యలేక చస్తుంటే, అన్నపూర్ణ అంత లేమి లోనూ మరొక ఆడపిల్ల కావాలని ఎందుకు కోరుకుంటోందో నాకు అర్థంకాలేదు.

"అన్నపూర్ణా! నీకు ముగ్గురు మగ పిల్లలు కదా! ఇంకా మీ అయనకి పిల్లలు పుట్టకుండా వుండే అపరేషన్ చేయించ కూడదూ?" ఏదో ప్రభోదాత్మకంగా అంటున్నట్లుగా చెప్పాను. ఇల్లు శుభ్రం చేస్తున్న అన్నపూర్ణ పడగ విప్పిన తాచు పాములా తల పైకెత్తింది. చేతిలో పని ఆపేసింది.

"ఆడాళ్లయి వుండీ, చదువుకుని కూడా మీరు ఆడపిల్ల లేకుండా ఆపరేసన్ చేయించు కోమంటారు. రేపు, ఈ మగ బుడితలు పెళ్లి కాగానే కులుక్కుంటూ పెళ్లాన్ని తీసుకుని వేరే కాపరం పెడతారు. నేను, మా ఆయన ముసలాళ్లమయి సచ్చిపోతే ఏడవటానికి ఒక్క ఆడ పిల్లయినా లేకపోతే ఎట్లాగమ్మా! ఆడ పిల్ల ఏడనున్నా వచ్చి నా శవం లేచేదాకా ఏడుస్తుంది గదమ్మా! ఒక్క ఆడపిల్ల లక్ష్మిలాగా ఇంట్లో వుంటే బరువా అమ్మా" అంది.

ఆమె 'ఆర్గ్యుమెంట్' విని నవ్వాలో, ఏడవాలో నాకు అర్థం కాలేదు.

అన్నపూర్ణ మా ఇంట్లో పని చేసినా, సాయంత్రం కాగానే టి.వి. చూడటానికి సకుటుంబంగా వస్తుంది. ఆదివారం తెలుగు సినిమా, శుక్రవారం చిత్రలహరి తప్పకుండా చూస్తుంది. టి.వీ.లో చూపించే కార్యక్రమాల్లోని ఇంగ్లీషు మాటలు, హిందీ మాటలు జాగ్రత్తగా గ్రహించి వాటిని తిరిగి ప్రయోగించటానికి ప్రయత్నిస్తుంది.

మా అమ్మాయి డిగ్రీ పాస అయింది. పెళ్లి సంబంధాలు చూడటానికి మావారు కాలికి బలపం కట్టుకుని తిరుగుతున్నారు. పెళ్లిళ్ల పేరయ్య దగ్గర కావలసిన ముడుపు చెల్లించి పెళ్లికొడుకుల అడ్రసులు తెచ్చారు. ఎంప్లాయిమెంట్ ఎక్స్‌ఛేంజ్ కంటే కూడా ఎక్కువ చురుగ్గా మా వారు పనిచేయ సాగారు. నగరంలో అడ్రసు కల వాళ్లందరినీ స్వయంగా కలిసి పెళ్లిచూపులకి 'డేట్' 'ఫిక్స్' చేసుకుని వస్తున్నారు. ఇద్దరికీ వీలుండేట్లుగా ఓ ఆదివారం రమ్మని చెప్పి వస్తున్నారు. వాళ్లు వచ్చినప్పుడల్లా కాఫీలు, ఫలహారాలు అన్నీ ఏర్పాటు చెయ్యాల్సిందే కదా! పూలు, పళ్లూ తేవటం, అమ్మాయిని అలంకరించటం ఇదంతా మామూలు తతంగమే కదా! ఆ ఏర్పాట్లలో సహాయంగా వుండటానికి అన్నపూర్ణని పిలిచే వాళ్లం.

ఆ రోజు ఆదివారం, పెళ్లివారు అమ్మాయిని చూట్టానికి వస్తున్నారు. అన్నపూర్ణ వచ్చింది. స్వీట్స్, కారా అన్నీ తెప్పించి పెట్టాము. మిగతా ఏర్పాట్లు కూడా పూర్తయినాయి. అబ్బాయి పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేసి, ఐ.ఏ.ఎస్. పరీక్షకి ఒక సారి వెళ్లాడు. ఇంకా ఉద్యోగాన్వేషణలోనే వున్నాడు.

అమ్మాయిని ముస్తాబుచేసి పెళ్లి వారి ముందు కూర్చో బెట్టాము. పిల్లని చూశారు. కాఫీ, టిఫిన్లు అయ్యాయి. మాటల్లో పడ్డారు.

"అమ్మాయి నచ్చింది కానీండి, ఇంకా రెండు ఇంచెస్ పొడుగుంటే బావుండేది" అన్నది అబ్బాయి తల్లి.

మరి ఏదో వంక పెట్టందే, మగ పెళ్లి వాళ్లు ఎలా అవుతారు.

"సన్నగా, పొడుగ్గా వుండే అమ్మాయి కావాలి అదే మా వాడి కోరిక అయినా మీకు ఏ సంగతి తెలియజేస్తాం" అంటూ వెళ్లిపోయారు.

మరొక నెలగడిచింది. "పిల్లని చూట్టానికి వస్తామని" మరొక పెళ్లివారు ఉత్తరం రాశారు. ప్రతిసారీ పెళ్లి చూపులకి చేసే ఏర్పాట్లన్నీ మామూలుగా చేశాం. అరేంజ్‌మెంట్స్‌కి అన్నపూర్ణ కూడా హాజరైంది.

"అమ్మాయికి వంటా వార్పూ వచ్చా?" పెళ్లి కుమారుడి తల్లి అడిగింది.

"కాలేజీకి వెళుతుంది కదా! వంటలో అంత నైపుణ్యం లేదు. హాలిడేస్‌లో నాకు సాయం చేస్తుంటుంది." అన్నాను.

"మీ అమ్మాయికి సంగీతం వచ్చా? మా అబ్బాయికి శాస్త్రీయ సంగీతం అంటే ఎంతో ఇష్టం. ఒక పాట పాడమనండి వింటాం" పెళ్లి కొడుకు అక్కగారు అడిగింది.

"కాలేజీ చదువుల వలన అమ్మాయికి సంగీతం నేర్చుకునేంత టైమ్ దొరకటం లేదండీ. అదీగాక వాళ్ల నాన్న గారు ఉద్యోగ రీత్యా ఊళ్లు తిరగటం వలన వీలు పడలేదండీ"

"శాస్త్రీయ సంగీతం పాడగల పిల్లని చేసుకోవాలని మావాడి జీవిత వాంఛ. వాడి కోరిక తీర్చలేని పిల్లని చేసి లాభం ఏమిటి చెప్పండి?" అంటూ పెదవి విరిచింది.

ఆ విధంగా ఆ పెళ్లి సంబంధం కూడా తప్పిపోయింది. అన్ని ముచ్చట్లూ తీర్చి ఓ లక్ష కట్నం ఇవ్వగలం. అయినా పెళ్లివారు ఏదో వంక పెట్టి వెళ్లి పోయారు.

"చూశావా, అన్నపూర్ణా! ఆడ పిల్ల పెళ్లి చెయ్యాలంటే ఎన్ని ఇబ్బందులో? అయినా నువ్వు ముగ్గురు మగ పిల్లల తర్వాత ఆడపిల్ల కావాలని కోరు కుంటున్నావే?" కొంచెం వ్యంగ్యంగానే అన్నాను

"నీకు ఆడపిల్ల పుడితే పెళ్లి ఎలా చేస్తావ్?" అడిగాను.

"దాని కోసం ఇప్పటి నుంచీ దిగులు పడి చచ్చిపోతే ఎలాగమ్మా! పెళ్లి చేసుకునే ధైర్యం పిల్లకి ఉగ్గుపాల నుంచే నేర్పుతాను. దానికి తగిన వాడొచ్చి తాళి కట్టి తీసుకెళతాడు. మా ఇళ్లల్లో పిల్ల పెళ్లి దిగులుండదమ్మా" అన్నపూర్ణ జవాబు చెప్పింది. అమె ధైర్యానికి మనసులోనే అభినందించాను.

మరొక నెల గడిచింది. మావారు తిరిగి తిరిగి మరొక సంబంధం తెచ్చారు. పెళ్లి చూపుల రోజు మామూలుగా అన్నపూర్ణ వచ్చింది. ఏర్పాట్లన్నీ మామూలుగా చేశాం.

"అమ్మాయికి భరత నాట్యంలో ప్రవేశం వుందా" పెళ్లి కుమారుడే అడిగాడు.

"భరత నాట్యం నేర్పించ లేక పోయాం బాబూ! మేం అదివరకు వున్న ఊళ్లలో నాట్యం నేర్పించే వారు వుండేవారు కాదు. ఇక్కడికి వచ్చాక కూడా అంత శ్రద్ధ తీసుకోలేదు." అన్నారు మావారు.

ఈ సారి కూడా వాళ్లు అవంకతో వెళ్లిపోతారని లోపల భయంగానే వుంది.

సంగీతం, నాట్యం, వంటా, వార్పూ, గ్రాడ్యుయేషన్, ఉద్యోగం అన్నీ వుంటేనే అమ్మాయికి పెళ్లి అవుతుందని అప్పుడు ఆలస్యంగా అర్థమైంది మాకు.

"అన్ని విద్దెలూ పుట్టింట్లోనే నేర్వాలా? పెళ్లయ్యాక మీకు కావల్సిన డాన్స్ నేర్పించకూడదూ! ఒకరు భరత నాట్యం కావాలంటారు. మరొకరు బ్రేక్ డాన్స్ కావాలంటారు. ఇంకొకరు పాప్ మ్యూజిక్ కావాలంటారు.

"అందరికీ అన్ని కోరికలు తీరేలా అమ్మాయిని తయారు చెయ్యాలంటే మాటలా? అమ్మా!" అన్నపూర్ణ గుక్కతిప్పుకోకుండా ఒక్కసారి అనేసింది.

కాఫీ కప్పులు చేత పట్టుకున్న పెళ్లి వాళ్లందరూ నిశ్శబ్దంగా వుండిపోయారు.

మాకు గుండెల్లో రైళ్లు పరుగెత్తాయి. పెళ్లి చూపులకి వచ్చిన వాళ్లతో అలామాట్లాడితే సంబంధం కలుస్తుందని ఎలా అనుకుంటాం?

"పని మనిషి ఏదో తెలీక అన్నదిలెండీ! దానికి మీరు మరొక విధంగా అనుకోకండి!" అని ఏదో సర్ది చెప్పబోయాను. పెళ్లివారు నామాటలు పట్టించుకోలేదు. కొంచెం సీరియస్‌గానే లేచి వెళ్లి పోయారు.

" మా అభిప్రాయం తెలియ జేస్తాంలెండి" అన్నారు వెళుతూ.

ఆ సంబంధం మీద మేం ఆశ పెట్టుకోలేదు. అన్నపూర్ణ 'వాక్చాతుర్యం' తో బెడిసి కొట్టింది. అనుకున్నాం.

కాని పది రోజుల తరువాత వాళ్ల దగ్గర నుంచి జాబు వచ్చింది.

"మాకు పిల్ల నచ్చింది. మీరు వచ్చి అన్నీ మాట్లాడి లగ్నాలు పెట్టించుకోండి". అదీ ఉత్తరం లోని సారాంశం.

పెళ్లి అయి మూడు నిద్దర్లకి వచ్చిన క్రొత్త అల్లుడు అన్నాడు — " మీ అన్నపూర్ణ అన్నమాట మాకు నచ్చింది. అందుకే మా పెళ్లి అయింది" అని!

—తులసీ మూర్తి